క్లుప్తంగా

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

గద్వాల అర్బన్: కామారెడ్డి జిల్లా, బీబీ పేట మండలానికి చెందిన గ్రామ పంచాయతీ వర్కర్ కొంగరి బాబు కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలని పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జమ్మిచేడు కార్తీక్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీపీ ఎంఎల్ ప్రజా పంథా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు నెలలుగా జీతాలు రాక ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియో ఇవ్వాలన్నారు. వెంటనే గ్రామ పంచాయతీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డివిజన్ కార్యదర్శి చింతరేవుల కృష్ణ, ఐఎఫ్టీయూ నాయకులు చంద్రాములు, బలరాం, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడిపై ఫిర్యాదు



అయిజ: మండల కేంద్రంలోని 39వ పోలింగ్ స్టేషన్‌లో పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు పచ్చర్ల తిమ్మారెడ్డిపై సోమవారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు కంపాటి భగత్ రెడ్డి ఎన్నికల అధికారి వరుణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. సీరియల్ నంబర్ 59కి చెందిన తిమ్మారెడ్డి ఎన్నికల బరిలో నిలిచిన గుర్రం చెన్నకేశవ రెడ్డికి సంబంధించిన బ్యాడ్జిని ధరించి పోలింగ్ బూత్‌లోకి వెళ్లి ఓటర్లను ప్రభావితం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు నాగరాజు, పట్టణ యువమోర్చా అధ్యక్షుడు అంజి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితం

మల్దకల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితమని మెడికల్ ఆఫీసర్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు నెలనెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు పోషకాలు ఎక్కువగా ఉండే పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహారంను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, జ్యోతి, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన నాయకులు



అలంపూర్: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిని హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో అయిజ మండల నాయకులు సోమవారం కలిశారు. ఇటీవల మంత్రి భుజం నొప్పి కారణంగా శస్త్ర చికిత్స చేసుకున్నారు. విషయం తెలుసుకున్నా జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ పటేల్ విష్ణువర్ధన్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, వైస్ చైర్మన్ నరసింహులు, మాజీ ఎంపీపీ ప్రకాష్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ చిన్న హనుమంతు, జిల్లా వక్ఫ్‌బోర్డు సభ్యులు జమాలుద్దీన్ తదితరులు మంత్రిని కలిసి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పాద యాత్రికులకు అన్నదానం



అయిజ: కర్నాటక రాష్ట్రం నుంచి శ్రీశైలానికి కాలినడకన వెళ్తున్న భక్తులకు ఎంపీపీ నాగేశ్వర్ రెడ్డి సోమవారం మండలంలోని ఎక్లాస్‌పురంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తన తండ్రి, కుమారుడు జ్ఞాపకార్థం ఎనిమిది సంవత్సరాల నుంచి కర్నాటక, మహారాష్ట్రతోపాటు ఇతర ప్రాంతాల నుంచి శ్రీశైలానికి కాలినడకన వెళ్తున్న భక్తులకు ప్రతి సంవత్సరం వారం రోజులపాటు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు.

కేసు నమోదు

గద్వాల క్రైం: ఎన్నికల కోడ్ ఉల్లంఘించి అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ గోపాల్ తెలిపారు. సోమవారం ఉదయం పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఉప్పేర్ గ్రామానికి చెందిన కురుమూర్తిగౌడ్ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు సిబ్బంది అదుపులోకి తీసుకున్నామన్నారు. సదరు వ్యక్తి నుంచి 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ప్రశాంతంగా ‘ఎమ్మెల్సీ’ పోలింగ్



ధరూరులో ఓటు హక్కు వినియోగించుకున్న ఉపాధ్యాయులు



అయిజలో ఎన్నికల పోలింగ్ కేంద్రంను సందర్శించిన తహసీల్దార్ లక్ష్మి



ఉండవెల్లిలో ఓటు వేసి వస్తున్న ఉపాధ్యాయులు

గద్వాల రూరల్: మహబూబ్‌నగర్–హైదరాబాదు–రంగారెడ్డి నియోజకవర్గ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నిక సోమవారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 877 మంది ఓటర్లకు జిల్లా వ్యాప్తంగా 11 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో అత్యల్పంగా గట్టులో 12 మంది ఓటర్లు ఉండగా, అత్యధికంగా జిల్లా కేంద్రంలోని గద్వాలలో 482మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్ ప్రక్రియ ఉదయం 9 గంటలకు మొదలు కాగా మొదట్లో మందకొడిగా మొదలై మధ్యాహ్నానికి వేగం పుంజుకుంది. ఈక్రమంలో ఉదయం 10గంటల సమయంలో ఖాళీగా కనిపించిన పోలింగు కేంద్రాలు ఆతరువాత పోలింగ్ వద్ద ఓటర్లు బారులు తీరారు. కలెక్టర్ వల్లూరు క్రాంతి ఉదయం నుంచి జిల్లాలోని వివిధ పోలింగు కేంద్రాలను సందర్శిస్తూ పోలింగు ప్రక్రియను పర్యవేక్షించారు. ఎస్పీ సృజన, డీఎస్పీ రంగస్వామి పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించి కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు చేపట్టారు.

97.15 శాతం..

మొత్తం 877 ఓటర్లు ఉండగా 852 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 316 మంది మహిళా ఓటర్లకు గాను 307 మంది, 561 మంది పురుష ఓటర్లకు 545 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా గట్టు, ఇటిక్యాల, ఉండవెల్లి, మానవపాడు నాలుగు మండల్లాల్లో వందశాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గట్టులో 12 మంది ఓటర్లు, ఇటిక్యాలలో 54, ఉండవెల్లిలో 29, మానోపాడులో 33, వడ్డేపల్లిలో 45 మంది ఓటర్లుండగా అందరు కూడ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా గద్వాలలో 482 ఓట్లకు గాను 464, ధరూరులో 40 ఓట్లకు గాను 39 ఓట్లు, మల్దకల్‌లో 22 ఓట్లకు గాను 21 ఓట్లు, అయిజలో 76 ఓట్లకు గాను 74 ఓట్లు, రాజోలిలో 24 ఓట్లకు గాను 23 ఓట్లు, అలంపూరులో 60 ఓట్లకు గాను 58 ఓట్లు పోలైనట్లు ఎన్నికల నిర్వాహణ అధికారి తెలిపారు.

జిల్లాలో పోలింగు కేంద్రాల వారీగా నమోదైన ఓట్ల వివరాలు ఇలా.

పోలింగ్	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
గద్వాల	482	464	96.27
ధరూరు	40	39	97.50
గట్టు	12	12	100.00
మల్దకల్	22	21	95.45
ఇటిక్యాల	54	54	100.00
అయిజ	76	74	97.37
వడ్డేపల్లి	45	45	100.00
రాజోలి	24	23	95.83
మానోపాడు	33	33	100.00
ఉండవెల్లి	29	29	100.00
అలంపూర్	60	58	96.67

మొత్తం ఓట్లు– 877, పోలైనవి 852, పోలింగ్ శాతం 97.15





శాంతినగర్ పోలింగ్ కేంద్రం ముందు పోలీసుల పహారా

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



కేటీదొడ్డి నందిన్నెలో ..



గట్టులో ఉపాధ్యాయులుగా విద్యార్థులు

కేటీదొడ్డి: మండలంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా, అధికారులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం షబానా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గట్టు: మండల కేంద్రంలోని బీసీ కాలనీ ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తరగతి గదుల్లో చక్కగా విద్యాబోధన చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సూరి, ఉపాధ్యాయురాలు ఇందుమతి, అంగన్‌వాడీ టీచర్ సుజాతమ్మ తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్: వడ్డేపల్లి మండలంని కొంకల మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు సోమవారం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణతో ఆకట్టుకున్నారు. చక్కగా పాఠాలు బోధించి ప్రశంసలు పొందారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వెంకటనర్సమ్మ, శ్రీనివాసులు, చిట్టెమ్మ, రవికుమార్, భరత్, తిరుమలమ్మ, నందిని, ఎంపీ ఫౌండేషన్ హనిమిరెడ్డి పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని ప్రాగటూరు ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. సోమవారం విద్యార్థులు ఎంఈఓగా, హెచ్‌ంగా, ఉన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్యామల పాల్గొన్నారు.

ధరూరు: మండల కేంద్రంలోని హరిజన్ చెర్రి ప్రాథమిక పాఠశాల, సీపీఎస్ ధరూరు, యూపీఎస్ మన్నాపురం పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు యోగేందర్, జోత్స్న, రేవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ధరూరు మన్నాపురం యూపీఎస్ పాఠశాలలో

ఘనంగా ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుక



గద్వాల రూరల్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకను సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సతీమణి బూరెడ్డిపల్లి సర్పంచు బండ్ల జ్యోతి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, పీఏసీఎస్ చైర్మన్ సుభాన్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును వినియోగించుకోవాలి



ఉండవెల్లి: మండలంలోని ప్రాగటూరు, ఇటిక్యాలపాడు గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమాన్ని 3వ రోజు కొనసాగించారు. సోమవారం క్యాతూరు పీహెచ్‌సీ పరిధిలోని ప్రాగటూరులో మూడో రోజు 56 మందిలో పురుషులు 27 మంది, స్త్రీలు 29 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. మానవపాడు పీహెచ్‌సీ పరిధిలోని ఇటిక్యాలపాడులో 143 మంది కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మెహందీ పోటీలు



పోటీలలో పాల్గొన్న మహిళలు

గద్వాల: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు మెహందీ, మ్యూజికల్ తదితర పోటీలను నిర్వహించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జరిగిన పోటీలను మున్సిపల్ కమిషనర్ నర్సింహా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు స్వయం శక్తితో ఆర్థికంగా ఎదగాలన్నారు. విద్యతోనే మహిళల అభివృద్ధి సాధ్యమన్నారు. అదేవిధంగా మంగళవారం స్థానిక ఇండోర్ స్టేడియంలో ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నామని మహిళలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది వెంకటేశ్వర్లు, శ్రీకర్, నిజాముద్దీన్, మహాలక్ష్మి, తిమ్మన్న, రిసోర్స్ పర్సన్‌లు తదితరులు పాల్గొన్నారు.

చల్లాను కలిసిన మందా జగన్నాథం



పుష్పగుచ్ఛం అందజేస్తున్న మందా జగన్నాథం

అలంపూర్: ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన మాజీ ఎమ్మెల్యే చల్లా వెంకట్రామిరెడ్డిని హైదరాబాదులోని ఆయన నివాసంలో ఢిల్లీలో ప్రభుత్వ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మందా జగన్నాథం, ఆయన తనయుడు మందా శ్రీనాథ్‌లు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు చల్లాకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గంలోని అలంపూర్, అయిజ, ఇటిక్యాల, మానవపాడు, ఉండవెల్లి మండలాలకు చెందిన పలువురు నాయకులు చల్లాను కలిశారు.

శ్రీశైలానికి పాదయాత్ర



కాళ్లకు కర్రలను కట్టుకుని పాదయాత్ర చేస్తున్న కర్ణాటక భక్తుడు

గట్టు/శాంతినగర్: మహారాష్ట్ర, కర్నాటక చెందిన శివ భక్తులు సోమవారం తెలంగాణ, కర్ణాటక సరిహద్దు గ్రామాలైన గట్టు, బల్గెర నుంచి పాదయాత్రగా శ్రీశైలానికి తరలివెళ్తున్నారు. కొందరు కాళ్లకు కర్రలను కట్టుకుని పాదయాత్ర చేస్తూ భక్తిని చాటుకున్నారు. ఆయా గ్రామాల్లో వారిని ఆసక్తి చూస్తున్నారు. వీరి యాత్ర ఉగాది పండుగ రెండు ముందు శ్రీశైలానికి చేరుకోనుంది. అలంపూర్–రాయచూర్ రోడ్డుపై సోమవారం వందల మంది భక్తులు తరలివెళ్లారు.

మహిళల అభ్యున్నతికి కృషి



మాట్లాడుతున్న కమిషనర్ మహమ్మద్‌ఖాజా

అమరచింత: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ తమ కుటుంబాలను ఆర్థిక పురోగతిలో ముందుకు తీసుకెళ్లాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా అన్నారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మోప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు సోమవారం వంటల పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పట్టణ మహిళా సమాఖ్య తరఫున అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా పొదుపు సంఘాల మహిళలకు వంటల పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. వంటల పోటీలో ప్రతిభ కనబర్చిన వారికి నగదు బహుమతులు అందిస్తున్నాన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు తిండి పదార్థాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, అలాంటి సందర్భాలను దృష్టిలో ఉంచుకొని పొదుపు సంఘాల సభ్యులు మంచి రుచికరమైన తిండి పదార్థాలను తయారు చేసి విక్రయించి ఆదాయం పెంచుకోవాలని సూచించారు. దీంతో పాటు క్యాటరింగ్ వసతిని నిర్వహించేందుకు ఆసక్తి కలిగిన వారికి మున్సిపల్ ఆధ్వర్యంలో స్థలాలను కేటాయించి వారి ఆర్థిక పురోగతికి సహకరిస్తామని భరోసానిచ్చారు.

స్వచ్ఛతపై దృష్టి పెట్టండి

మహిళలు తమ ఇళ్లలోని తడి, పొడి చెత్తలను వేరు చేసి తమ కాలనీకి వస్తున్న చెత్త ట్రాక్టర్లకు అందించాలని మున్సిపల్ కమిషనర్ కోరారు. పారిశుద్ధ్యం, ఘనవ్యర్థాల నిర్వహణలో ప్రతిభ కనబర్చిన మహిళలకు మహిళా ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత ఉత్సవ్-2023 పేరుతో అవార్డులతో సత్కరించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. వ్యక్తిగత, స్వయం సహాయక, చిన్న తరహా, స్టార్టప్, ఎన్‌జీఓతో పాటు సామాజిక టాయిలెట్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ సర్వీస్ వ్యర్థాల శుద్ధీకరణ, చెత్త సేకరణ, రవాణాలతో పాటు చెత్తతో కళాకృతులు చేసే రంగాల మహిళలు 15 లోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలను సెల్ నంబర్ 63611 83912 లకు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ఎస్ఏ రాజు, కౌన్సిలర్లు విజయరాములు, లావణ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్, మెప్మా కోఆర్డినేటర్ యువరాజు, పట్టణ సమాఖ్య కార్యదర్శి నాగమణి, ఆర్పీలు సంగీత, రాజేశ్వరి, ఖాజా, గోపాల్ బ్యాంకు మిత్ర కమల తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పింఛన్లు ఇవ్వాలని ఆందోళన

అమరచింత: వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు సకాలంలో ఆసరా పింఛన్లు అందించి ఆదుకోవాలని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వామపక్షాల నాయకులు సోమవారం ఆందోళన నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల 5వ తేదీ లోపు ఆసరా పింఛన్లు అందించాలని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరంలో ఒక నెల పింఛన్ ఇవ్వటం లేదని వాపోయారు. కుటుంబ సభ్యుల ఆదరణ లేని వారికి పింఛన్ డబ్బులు ఎంతో ఉపయోగపడుతున్నాయని, ఇప్పటికైనా సకాలంలో ఆసరా పింఛన్లు చెల్లించాలని ఎంపీఓ నరసింహులుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో శ్యాంసుందర్, బుచ్చన్న, సామేలు, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ పట్టణంలోని 1996 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు 27 ఏళ్ల తర్వాత కర్నూలు జిల్లా కేంద్రంలో పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. సోమవారం కర్నూలు పట్టణ కేంద్రంలో ఒకరికొకరు కలుసుకొని యోగ క్షేమ, సమాచారాలు తెలుసుకున్నారు. సింగపూర్, దుబాయి దేశాల నుంచి మిత్రులు రావడం సంతోషంగా ఉందని విద్యార్థులు పేర్కొన్నారు.


పిచ్చి కుక్క స్వైర విహారం

మానవపాడు: మండలంలోని కొర్విపాడులో పిచ్చికుక్క స్వైర విహారం చేసి ఇద్దరు వ్యక్తులతో పాటు రెండు బర్రెలు, రెండు మేకలపై దాడి చేసిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొర్విపాడు గ్రామానికి చెందిన సందప్పను పిచ్చికుక్క కరిచింది. గ్రామంలో బెల్లం చెరుకు పనులు చేయడానికి వలసకూలీగా వచ్చిన మహారాష్ట్ర మహిళ అరుణను గాయపరిచింది. బాధితులను చికిత్స నిమిత్తం కర్నూల్‌లోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అదేవిధంగా మరో 2 బర్రెలు, 2 మేకలపై దాడి చేసి వాటిని తీవ్రంగా గాయపరిచిందని స్థానికులు తెలిపారు. గ్రామంలో పిచ్చికుక్కలను తరలించాలని అధికారులను గ్రామస్తులు వేడుకున్నారు.


ఘనంగా వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ

అయిజ: మండలంలోని యాపదిన్నెలో సోమవారం వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠతను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ప్రభాతపూజ, దీక్షహోమం, జపదశ హవనం, శాంతో హోమం, రక్షాహోమం, ప్రతిష్ఠహోమం, యంత్ర విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, బలిహరణం, పూర్ణాహుతి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమానికి ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ హాజరయ్యారు.

మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి



మల్దకల్ అమరవాయిలో నర్సరీని పరిశీలిస్తున్న ఏపీఓ స్వామి



గద్వాల రూరల్ అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్

మల్దకల్: హరితహారం నాటికి నర్సరీలలో లక్ష్యం మేరకు మొక్కలను పెంచేందుకు నర్సరీ నిర్వాహకులు ప్రత్యేక దృష్టి సారించాలని ఏపీఓ స్వామి సూచించారు. సోమవారం మండలంలోని అమరవాయిలో నర్సరీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నర్సరీలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలను పెంచి హరితహారం నాటికి సిద్ధం చేయాలన్నారు. మొక్కలకు నీరందించి వాటిని సంరక్షించాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో వందమంది కూలీలకు తగ్గకుండా పనులకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచు పద్మమ్మ, నర్సరీ నిర్వాహకులు రంగన్న, రఘుపతి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గద్వాల రూరల్: మొక్కల సంరక్షణకు ప్రత్యేక సిబ్బంది ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ అన్నారు. సోమవారం ఆయన సంగాల పార్కును సందర్శించారు. పార్కులో నాటిన మొక్కలను పరిశీలించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ మొక్కల సంరక్షణ అందిరి బాధ్యత అన్నారు. ఎండిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అలంపూర రూరల్: మండలంలోని జిల్లెలపాడ్ నర్సరీని ఎంపీడీఓ నాగ శేషాద్రిసూరి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి నర్సరీ నిర్వహణపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వేసవికాలంలో మొక్కలు ఎండకుండా జాగ్రత్తలు తీసుకోవాలిన సూచించారు. హరితహారం నాటికి మొక్కలు సిద్ధంగా ఉంచాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

ఆత్మగౌరవ యాత్రను విజయవంతం చేయండి



గట్టులో పాదయాత్ర పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

గట్టు: ఆత్మగౌరవ యాత్రను విజయవంతం చేయాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు బలరాం కోరారు. సోమవారం దీనికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆయన మండల కేంద్రంలో విడుదల చేశారు. అనంతరం బలరాం మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ బోయలగూడెం నుంచి పాదయాత్రను ప్రారంభించనున్నట్లు తెలిపారు. రాబోయో రోజుల్లో బహుజన రాజ్యాధికారం సాధించడమూ లక్ష్యంగా పాదయాత్రను చేపట్టినట్లు తెలిపారు. 21 రోజులు 400 కిలోమీటర్లు, 114 గ్రామాల్లో పాదయాత్ర కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు వెంకట్రాములు, దయాకర్, సురేష్, జమ్మన్న, నర్సింహులు, తాయేష్, ఫకీరప్ప, రాముడు, హనుమంతు, మల్దకల్, జమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

డ్రైయినేజీ గుంత పూడ్చండి



గుంతను పరిశీలిస్తున్న ఎస్ఐ సంతోష్

మానవపాడు: మండల కేంద్రంలోని గాంధీచౌక్ చౌరస్తా నుంచి ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో గుంత ఏర్పడింది. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. మండల కేంద్రానికి, జాతీయ రహదారి–44కు నిత్యం ఈ దారి గుండా ప్రయాణాలు కొనసాగుతుంటాయి. ఈ రోడ్డుపై ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారి మధ్యలో గుంత ఉండటంతో వాహనదారులు ప్రమాదాలభారిన పడుతున్నారు. నిత్యం ఈ దారిగుండా అధికారులు, ప్రజాప్రతినిధులు రాకపోకలు సాగిస్తుంటారు. చూసిచూడనట్లు వ్యవహరించడం పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయమై మానవపాడు ఎస్ఐ సంతోష్ స్పందించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తమవంతు సహాయంగా గుంతను పూడుస్తామని ప్రయత్నిస్తామన్నారు.